క్లుప్తంగా

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



అంధ విద్యార్థులకు నిత్యావసరాలు అందజేస్తున్న సుబ్బారావు

ఒంగోలు మెట్రో: మానవతా సేవా సంస్థ ఒంగోలు శాఖ కన్వీనర్ మారెళ్ల సుబ్బారావు ఆధ్వర్యంలో చక్కా వెంకట సుబ్బారావు, శ్రీలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో శనివారం ఉదయం ఒంగోలు కర్నూలు రోడ్డులోని రావి ఆంజనేయులు రోడ్డులో గల గుడ్ న్యూస్ మినిస్ట్రీ అంధుల పాఠశాలలో విద్యార్థులకు బియ్యం, నిత్యావసర సరుకులు, సబ్బులు, పేస్టులు, బ్రష్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బీసీ సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు, సినీనటుడు దన్నారపు మస్తాన్‌రావు మాట్లాడుతూ మానవతా సేవా సంస్థ సేవా కార్యక్రమాలలో భాగంగా మారెళ్ల సుబ్బారావు మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తన్నీరు సురేష్, దివ్యాంగుడు స్వర్ణ మోహన్‌రావు పాల్గొన్నారు.

నేడు మాల సాంస్కృతిక కళా ప్రదర్శనలు

ఒంగోలు వన్‌టౌన్: దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఒంగోలు నెల్లూరు బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ కళా ప్రాంగణంలో మాల సాంస్కృతిక కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు చప్పిడి వెంగళరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్, మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రొఫెసర్ జీవీ రత్నాకర్, తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ డాక్టర్ వెన్నెలా గద్దర్, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

84 పొగాకు బేళ్ల విక్రయం

సంతనూతలపాడు: మండల పరిధిలోని ఒంగోలు ఒకటో పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 84 పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. చిలంకూరు క్లస్టర్ పరిధిలోని 146 పొగాకు చెక్కులను వేలానికి అనుమతించారు. వీటిలో 62 పొగాకు చెక్కులను వివిధ కారణాలచే తిరస్కరించారు. కేజీ పొగాకు అత్యధిక ధర రూ.280, కనిష్ట ధర రూ.270, సరాసరి ధర రూ.276.13 పలికింది. వేలంలో పది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వేలం నిర్వహణ అధికారి ఎం.రవికాంత్ పర్యవేక్షించారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

సంతనూతలపాడు: అతి వేగంగా వస్తున్న ఆటో ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం రాత్రి ఎస్ఎన్ పాడు బస్టాండ్ సెంటర్ వద్ద జరిగింది. మృతుని కుమారుడైన సింగంశెట్టి రాజు శ్రీను ఫిర్యాదు మేరకు ఎస్సై అజయ్ కుమార్ కేసు నమోదు చేశారు. మృతుని కుమారుడు తెలిపిన వివరాల ప్రకారం.. సింగంశెట్టి వెంకటస్వామి (59) శుక్రవారం రాత్రి 11.30 గంటలకు టిఫిన్ కోసం బస్టాండ్ సెంటర్‌కు నడుచుకుంటూ వచ్చారు. ఆ సమయంలో ఒంగోలు నుంచి చీమకుర్తి వైపు వెళ్తున్న ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. అతనికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఆటోలో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. కానీ, మార్గం మధ్యలోనే మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ కుమార్ తెలిపారు.

జిల్లా అభివృద్ధిలో బాలినేని పాత్ర సున్నా



మాట్లాడుతున్న కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

ఒంగోలు టౌన్: ఐదు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా పనిచేసినప్పటికీ జిల్లా అభివృద్ధిలో బాలినేని శ్రీనివాసరెడ్డి పాత్ర ఏమీలేదని కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి బాలినేని చేసిందేమీ లేదన్నారు. అలాంటి వ్యక్తి రాజకీయాలకు పనికిరారన్నారు. పిఠాపురం జనసేన ఆవిర్భావ సభ మొత్తం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడానికే సరిపోయిందని ఎద్దేవా చేశారు. కనీసం ఒక్క సంక్షేమ పథకం గురించైనా మాట్లాడిన నాయకుడు ఆ వేదికపై ఎవరూ కనిపించలేదన్నారు. ఒక తరాన్ని చెడగొట్టే ప్రయత్నం తప్ప పార్టీ విధానాల గురించి మాట్లాడిన పాపానపోలేదన్నారు. గత 60 ఏళ్లలో ఇలాంటి ఆవిర్భావ సభ ఎన్నడూ చూడలేదని చెప్పారు. బాలినేనికి పూనకం వచ్చినట్లు జగనన్న గురించి కక్ష కట్టినట్లు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఇన్నాళ్లూ పెంచి పెద్ద చేసిన వైఎస్సార్ సీపీ మీద విమర్శలు గుప్పించినవాడు రేపు జనసేనను విమర్శించడని గ్యారంటీ ఏమిటని ప్రశ్నించారు. అందుకే పిఠాపురంలో బాలినేని ప్రసంగం విని జనం నవ్వుకుంటున్నారని చెప్పారు. చిరంజీవి తమ్ముడు కాకపోతే పవన్ కళ్యాణ్ అసలు హీరో అయ్యేవాడే కాదన్నారు. ఎన్టీఆర్ కూతురిని పెళ్లి చేసుకోకపోతే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యేవాడే కాదన్నారు. జగన్ గురించి, వైఎస్సార్ సీపీ గురించి ఒక్క మాట మాట్లాడినా ఒప్పుకునేది లేదని కుండబద్దలు కొట్టారు. పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్ మాట్లాడుతూ వైఎస్సార్ కుమారుడిగా కాకుండా జగనన్న ఎంతో కష్టపడి ముఖ్యమంత్రి అయ్యారని, 3 వేల కిలోమీటర్లకుపైగా రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేసి ప్రజలతో మమేకమయ్యారని చెప్పారు. ఒక్కడిగా ప్రయాణం మొదలుపెట్టి 2014 ఎన్నికల్లో 67 మంది ఎమ్మెల్యేలు, 2019 ఎన్నికల్లో 151 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకుని ప్రజానాయకుడిగా ఎదిగి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. అందుకు భిన్నంగా పవన్ కళ్యాణ్ ఒంటరిగా నిలబడినప్పుడల్లా ఓటమి పాలయ్యాడని, టీడీపీ, బీజేపీలతో కూటమి కడితేగానీ గెలవలేకపోయాడని అన్నారు. జగనన్నకు పవన్ కళ్యాణ్‌కు పోలికేమిటని ప్రశ్నించారు. బాలినేనితో 30 ఏళ్లకుపైగా కలిసి నడిచిన కార్యకర్తలకు చేసిన న్యాయం ఏమిటని నిలదీశారు. కార్యకర్తలను వాడుకుని వదిలేయడం బాలినేనికి అలవాటని విమర్శించారు. చేతనైతే ఒంగోలు నుంచి సింగిల్‌గా పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు మాట్లాడుతూ బాలినేని తీరు ఏరుదాటిన తర్వాత ఓడ మల్లన్న అన్నట్లుందని విమర్శించారు. జనసేనలోకి వెళ్లిన తర్వాత ఆయనకు పవన్ కళ్యాణ్ వేషాలు అబ్బినట్లున్నాయని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ పదవి కోసం జగనన్న మీద విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు భూమిరెడ్డి రమణమ్మ మాట్లాడుతూ ఊరుకూరికే అలగడం, ఆడబిడ్డ ఏడ్చినట్టు ఏడవడం బాలినేనికి అలవాటని చెప్పారు. టీడీపీ నాయకులు మహానేత వైఎస్ కుటుంబాన్ని వేధించినప్పుడు బాలినేని నోరు ఏమైందని మండిపడ్డారు. ఒకవేళ జగనన్న గెలిచి ఉంటే నువ్వు పార్టీ మారేవాడివా అంటూ ప్రశ్నించారు. ఇక్కడ నీలాగ అమ్ముడు పోయేవాళ్లు ఎవరూ లేరని, జగనన్న మీద విమర్శలు చేస్తే పద్ధతిగా ఉండదని హెచ్చరించారు. మహిళా విభాగం నియోజకవర్గ నాయకురాలు షేక్ అఫ్సర్ మాట్లాడుతూ జనసేన ఆవిర్భావ సభలో రెండు కులాల మధ్య, మతాల మధ్య విద్వేషాలు రగిలించే ప్రయత్నం జరిగిందన్నారు. సమాజానికి ప్రమాదకరంగా తయారైన పవన్ కళ్యాణ్ బావజాలంతో కలిసి పనిచేస్తే బాలినేనికి ఒంగోలు ముస్లింలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జగనన్నతోనే ముస్లింల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ఎంతో మంది ముస్లింలు పట్టభద్రులయ్యారని, చదువుకున్న ముస్లింలు ప్రస్తుత పరిస్థితులను గమనించి వైఎస్సార్ సీపీని బలపరచాలని పిలుపునిచ్చారు.

పర్యావరణ క్షీణతను తగ్గించాలి



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

- సహజ వనరులను వినియోగించాలి
- జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సిటీ: పర్యావరణ క్షీణతను తగ్గించే విధంగా సహజ వనరులను వినియోగించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. ఒంగోలులోని డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ప్రపంచ వినియోగదారుల దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సహజ వనరుల వినియోగం విధానాన్ని అవలంబించడం ద్వారా సామాజిక, ఆర్థిక అభివృద్ధితో పాటు అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందించవచ్చన్నారు. షాపింగ్ చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. అవసరం అనుకుంటే పునర్వినియోగ ప్లాస్టిక్‌ని వినియోగించాలని సూచించారు. ప్లాంట్ బేస్డ్ ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అందులోనూ స్థానికంగా, కాలానుగుణంగా లభించే పండ్లు, కూరగాయలకు ప్రాధాన్యత ఇవ్వాలని, సెలవులు, సెలబ్రేషన్స్ నిర్వహణలో వృథాని తగ్గించుకోవాలని కోరారు. ఆర్గానిక్ ఉత్పత్తులను ఎంచుకోవాలని, మొక్క ఆధారిత వస్త్రాలను ఎక్కువగా, జంతు ఆధారిత వస్త్రాలను తక్కువగా ఉపయోగించాలన్నారు. నీటి వాడకంలో వివేకం, విజ్ఞత ప్రదర్శిస్తూ నీటి వృథాని అరికట్టాలని తెలిపారు. ఒంగోలు నగరంలో ఏర్పాటవుతున్న అపార్ట్‌మెంట్ల విషయంలో కొత్తగా వచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అపార్ట్‌మెంట్ల బిల్డర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి విధివిధానాలపై కరపత్రాల ద్వారా ప్రచారం చేయాలని చెప్పారు. ఎవరైనా వినియోగదారులు ఏ వస్తువు మీదైనా నష్టపోతే ఎవరిని సంప్రదించాలనే అంశంపై విద్యార్థులకు తెలియజేసే విధంగా కరపత్రాలు తయారు చేయించి ప్రతి స్కూల్‌కు పంపడం జరుగుతుందన్నారు. అలాగే ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. సమావేశంలో జిల్లా వినియోగదారుల ఫోరం ప్రెసిడెంట్ డి.శ్రీదేవి, జిల్లా వినియోగదారుల ఫోరం మెంబర్ డాక్టర్ సమీర, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్.పద్మశ్రీ, ఫుడ్ కంట్రోలర్ జి.ప్రభాకర్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ డి.అనిల్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, ఏ.చంద్రమౌళేశ్వరరావు, వినియోగదారుల ఆర్గనైజేషన్ ప్రతినిధి ఎం.నాగేశ్వరరావు, నరసింహులు, రషీద్, నాగేంద్రరావు, రాధాకృష్ణమూర్తి, మురళీకృష్ణ, సీహెచ్‌వీఎస్ఆర్ ప్రసాద్, గ్యాస్ ఏజెన్సీ డీలర్లు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంక్ లింకేజీ రుణాల లక్ష్యాలు పూర్తి చేయాలి

- డీఆర్‌డీఏ పీడీ నారాయణ

ఒంగోలు వన్‌టౌన్: బ్యాంక్ లింకేజీ రుణాల లక్ష్యాలు పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ సూచించారు. ఒంగోలులోని భాగ్యనగర్‌లో గల టీటీడీ సెంటర్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ–వెలుగు ఆధ్వర్యంలో కొండపి, సంతనూతలపాడు క్లస్టర్ల పరిధిలోని మండలాల్లో ఉన్న అన్ని బ్యాంక్‌ల బ్రాంచ్ మేనేజర్లకు శనివారం శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మహిళలు ఏర్పాటు చేసే సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పీఎం ఎంఎంఈ, పీఎంఈజీపీ రుణాలలో పురోగతి సాధించాలన్నారు. ఆర్‌బీఐ మాస్టర్ సర్క్యులర్ గురించి వివరించారు. బ్యాంక్ లింకేజీ ఎస్‌ఓపీలపై సమీక్షించారు. బ్రాంచ్ పరిధిలో ఉన్న పెండింగ్ పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ సబ్సిడీ రుణాలను పూర్తి చేయాలన్నారు. మొండి బకాయిల రికవరీలలో వెలుగు సిబ్బంది బ్యాంకులకు పూర్తి సహకారం అందించాలన్నారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నారాయణ

అన్ని బ్యాంకుల మేనేజర్లు వారి పరిధిలో రుణాల మంజూరును ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. స్వయం సహాయక రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ డివిజినల్ మేనేజర్ రాఘవేంద్ర, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సీనియర్ మేనేజర్ అభినయ్, యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ సాబిర్, బ్యాంక్ లింకేజీ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సనీత, జీవనోపాధుల జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డేవిడ్, ఏపీఎంలు, కొండపి, సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాల బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఏజీపీగా శివరామకృష్ణ



ఏజీపీ శివరామకృష్ణ

ఒంగోలు: ఒంగోలులోని జూనియర్, సీనియర్ సివిల్ కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా బోడపాటి వెంకట శివరామకృష్ణ నియమితులయ్యారు. ముక్తినూతలపాడుకు చెందిన శివరామకృష్ణ పదో తరగతి వరకు త్రోవగుంట ఉన్నత పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ స్థానిక మంగమ్మ కాలేజీలో, న్యాయవిద్యను ఆంధ్రా యూనివర్శిటీలో పూర్తిచేశారు. ఏడు సంవత్సరాల పాటు యడవల్లి వెంకట శేషయ్య, రామకృష్ణల వద్ద జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసి ప్రస్తుతం సొంతంగా ప్రాక్టీసు చేస్తున్నారు. ఒంగోలు బార్ అసోసియేషన్ సభ్యులైన ఈయనను తాజాగా ప్రభుత్వం అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమించింది. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి 3 సంవత్సరాల పాటు ఈ హోదాలో కొనసాగుతారు.

మహిళలపై అఘాయిత్యాలు అరికట్టేందుకే శక్తి

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరిగే అఘాయిత్యాలు, వేధింపులను అరికట్టేందుకు శక్తి టీంలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో శక్తి టీంలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శక్తి టీం సభ్యులు కళాశాలలు, పార్కులు, ఆర్టీసీ బస్టాండు వంటి ముఖ్య కూడళ్లలో మఫ్టీలో తిరుగుతుంటారని తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మహిళలు, చిన్నారులపై జరిగే వేధింపులను అరికట్టడం, నేరాలను నిరోధించడం, తక్షణ సాయం అందించి రక్షణ కవచంలా నిలబడటం చేస్తారన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన 6 బృందాలలో ఒంగోలు 3, దర్శి 1, కనిగిరి 1, మార్కాపురం ఒక టీం విధులు నిర్వర్తిస్తారన్నారు. ఆపద సమయంలో శక్తి యాప్‌నకు వచ్చే కాల్స్‌కు స్పందించి ఘటన స్థలానికి చేరుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుధాకర్, వన్‌టౌన్ సీఐ నాగరాజు, తాలూకా సీఐ అజయ్‌కుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఏప్రిల్ 1 నుంచి అంబేడ్కర్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్

ఒంగోలు వన్‌టౌన్: ఏప్రిల్ 1 నుంచి అంబేడ్కర్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని మంగమూరురోడ్డులో మర్రిచెట్టు వద్ద ఉన్న గ్రౌండ్‌లో జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఈ పోటీల్లో పాల్గొనే జట్లు ఈ నెల 30వ తేదీలోపు ఎంట్రీ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9505690158 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

స్వచ్ఛతకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలి

- మండల స్పెషలాఫీసర్ నారాయణ

మద్దిపాడు: స్వచ్ఛతకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని, అప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చని మండల స్పెషలాఫీసర్ టి.నారాయణ కోరారు. మండలంలోని అన్నంగి గ్రామంలో సర్పంచ్ పల్లపాటి లోకేశ్వరి అధ్యక్షతన శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల స్పెషలాఫీసర్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో పారిశుధ్య కార్యక్రమాన్ని కలిసికట్టుగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. చెత్తను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో డి.ఎస్.వి.ప్రసాద్ మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాల్లో ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ భూమిలో కలవాలంటే కొన్ని సంవత్సరాలు పడుతుందన్నారు. ప్లాస్టిక్ కవర్లు వాడకం తగ్గించాలన్నారు. అనంతరం అన్నంగి గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహించారు. మహిళలకు ఉచితంగా జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవో పీఆర్డీ కె రఘుబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షక ఇంజినీర్ బాలశంకర్, టీడీపీ నాయకుడు జయంత్ బాబు, గ్రామ కార్యదర్శి చంద్ర, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



అన్నంగిలో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, గ్రామస్తులు

బంగారు బాల్యంపై సమీక్ష

సంతనూతలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బంగారు బాల్యం కార్యక్రమంపై ఎంపీడీవో డి.సురేష్‌బాబు పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం చిన్నారులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలని అధికారులను ఆదేశించారు. డ్రాపవుట్లు లేకుండా చూడాలని, బాల్యవివాహాల నిషేధంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఆటలు పోటీలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.వెంకారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, పార్వతీబాయ్, డ్వామా ఏపీవో వాసంతి, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

వైభవంగా వెంకటేశ్వరస్వామి కళ్యాణం

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు, ప్రథమ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీనివాస కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గుంటూరు వాస్తవ్యుడు నల్లూరి జగదీష్ కుమార్ బృందం ఆధ్వర్యంలో కనుల పండువగ స్వామివారి కళ్యాణం జరిగింది. స్వామివారికి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు, బుక్కితుల బృందం ఆధ్వర్యంలో శేష వాహనంపై స్వామివారికి ఉత్సవం నిర్వహించారు. ఎదుర్కోలా, శ్రీనివాస కళ్యాణ మహోత్సవం, హోమాలు, గ్రామోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే విజయ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పరాంకుశం ప్రసాద్, అజయ్ బాబు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేలాదిమందికి అన్నదానం చేశారు. అనంతరం ఆలయంలో ఏకాంత సేవ నిర్వహించారు.



గజ వాహనంపై ఊరేగుతున్న వెంకటేశ్వరస్వామి

విద్య ఆవశ్యకతను తెలుసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



పాల్గొన్న విద్యార్థినులు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: విద్యార్థులంతా విద్య ఆవశ్యకతను తెలుసుకుని ముందుకు సాగాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. ఒంగోలులోని పి.వి.ఆర్. బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులతో శనివారం కలెక్టర్ మాట్లాడారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అవసరమైన మౌలిక సదుపాయాలను జిల్లా యంత్రాంగం పరీక్ష కేంద్రాల్లో కల్పిస్తున్నట్లు చెప్పారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా, సానుకూల దృక్పథంతో పరీక్షలు రాయాలని విద్యార్థినులకు సూచించారు. భవిష్యత్తులో విద్యార్థుల లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. వాటిని చేరుకోవడానికి, ఉన్నత విద్యాభ్యాసానికి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పాస్‌పోర్ట్ లాంటివని కలెక్టర్ వ్యాఖ్యానించారు. పరీక్షలు బాగా రాయాలంటూ ఆల్ ది బెస్ట్ చెప్పి విద్యార్థినులలో స్ఫూర్తి నింపారు. ప్రతీ ఆడపిల్ల కనీసం డిగ్రీ పూర్తి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కామన్ ఎగ్జామినేషన్స్ బోర్డు కార్యదర్శి శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి టి.కిషోర్ బాబు, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఏ.సుధారాణి, ఇతర టీచర్లు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న వంతెనను పునఃనిర్మించాలి

చీమకుర్తి రూరల్: శిథిలావస్థలో ఉన్న వంతెనను పునఃనిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శనివారం మండలంలోని కేవీ పాలెం, దేవరపాలెం, పాటిమీదపాలెం గ్రామాల్లో నాయకులు పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. చీమకుర్తి నుంచి కేవీ పాలెం మధ్య ఎన్ఎస్పీ కాలువపై శిథిలావస్థలో ఉన్న వంతెనను నూతనంగా నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. దేవరపాలెంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలలో డ్రైనేజీ సమస్యతో పారిశుధ్యం లోపించిందని, పాటిమీదపాలెంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు తొలగించాలని నాయకుల దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వేమా అశ్విని సురేష్, సీపీఎం జిల్లా నాయకుడు పూసపాటి వెంకటరావు, మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, శీలం ఆదినారాయణ, కంకణాల వెంకటేశ్వర్లు, బి.శ్రీను, టి.రామారావు, ఓబుల్ రెడ్డి, కృష్ణయ్య, సుధాకర్, అక్కయ్య పాల్గొన్నారు.

ఊర చెరువును మంచినీటి చెరువుగా మార్చాలి...

ఒంగోలు టౌన్: నగరం నడిబొడ్డునున్న 7 ఎకరాల ఊరచెరువును శాశ్వతంగా మంచినీటి చెరువుగా మార్చాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఊర చెరువు రోడ్డు, సమైక్యత నగర్, కోటవీధి, బండ్లమిట్ట, మంగలపాలెం, వంటవారికాలనీలో సీపీఎం నాయకులు పర్యటించారు. ఊరచెరువు వద్ద నిరసన తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటకుండా అనేక సంవత్సరాల పాటు ఊరచెరువు ఉపయోగపడిందన్నారు. పాలకుల ముందు చూపు లేని కారణంగా దీన్ని డంపింగ్ యార్డుగా, కొంత భాగాన్ని మార్కెట్‌కు కేటాయించారన్నారు. ఆక్రమణలకు గురైన ఊర చెరువును కాపాడాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నాయకులు సయ్యద్ హుసేన్, తంబి శ్రీనివాసరావు, టి.మహేష్, మారెళ్ల సుబ్బారావు, అంజిరెడ్డి, నరసింహారావు, పోకల కోటేశ్వరరావు, విశ్వసేన్ తదితరులు పాల్గొన్నారు.



గ్రావెల్ తవ్వకాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

అనుమతి గోరంత.. తవ్వకాలు కొండంత

- అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు
- అడ్డుకున్న గ్రామస్తులు

చీమకుర్తి రూరల్: మండల పరిధిలోని పల్లామల్లి గ్రామ ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ఓ కన్‌స్ట్రక్షన్ సంస్థ వాహనాలను శనివారం అడ్డుకున్నారు. తవ్వకాలను నిలిపివేసిన గ్రామస్తులు ఆందోళనకు దిగారు. విజయవాడ నుంచి బెంగళూరుకు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తున్న క్రమంలో పల్లామల్లి గ్రామ సర్వే నంబరు 33/2లో 4 హెక్టార్లలో గ్రావెల్ తవ్వకాలకు పర్మిషన్ ఉందంటూ తవ్వకాలు చేపట్టారు. కానీ, రెవెన్యూ అధికారులు, కన్‌స్ట్రక్షన్ సంస్థ వారు అనుమతి పత్రాలు చూపించడంలేదని గ్రామస్తులు చెబుతున్నారు. 4 హెక్టార్లకు అనుమతులు ఉన్నాయని చెబుతూ కొండపై 8 ఎకరాలలో తవ్వకాలు జరిపారని, మరో కొండపై కూడా అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారని తెలుసుకుని శనివారం గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్నారు. అధికారులు వెంటనే స్పందించి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు బెల్లంకొండ శ్రీనివాస్, బూతలపల్లి కోటయ్య, కంఠ్లం అంకయ్య, తదితరులు డిమాండ్ చేశారు.



గ్రామస్తులు నిలిపివేసిన లారీలు, జేసీబీలు

ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలి

సంతనూతలపాడు: ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలని జెడ్పీ సీఈవో బి.చిరంజీవి ఆదేశించారు. సంతనూతలపాడులో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎంపీడీవో డి.సురేష్ బాబు, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: వివిధ గ్రామాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించగా, ఎంపీడీఓ వై.మహాలక్ష్మి పాల్గొని మాట్లాడారు.

చీమకుర్తి: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పాల్గొని గుడ్డ సంచులు పంపిణీ చేశారు.

కొత్తపట్నం: కొత్తపట్నంలో జిల్లా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధించాలని కోరుతూ విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. గమళ్లపాలెంలో జిల్లా పంచాయతీ అధికారి జి.వెంకట నాయుడు పాల్గొని మాట్లాడారు.